## మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు



3లో...

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 111
సంచిక : 232
పేజీలు : 3
ఆదివారం, మే 03, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN



### ఎన్ని రోజులు
## గేటు మూసివేత?

**-తూతు మంత్రంగా సాగుతున్న రైల్వే పనులు**

**టీ మీడియా,మే2, సింగరేణి (కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని సూర్య తండ--అప్పాయిగూడెం రైల్వే గేటు పనులు ప్రారంభించి పది రోజులు కావస్తున్నప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సాధారణంగా రెండు మూడు రోజుల్లో పూర్తవాల్సిన పనులు రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యమవుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు నామమాత్రంగా సాగుతున్నాయని వారు పేర్కొంటున్నారు.గేటు మూసివేత కారణంగా ఈ మార్గంలో వెళ్లాల్సిన వారు దూర మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది.ఎండాకాలంలో అదనపు దూరం ప్రయాణించడం మరింత కష్టంగా మారిందని స్థానికులు అంటున్నారు.ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల వద్దకే పాలన





### ప్రతి వినతికి న్యాయం చేస్తాం

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా, మే 2, నేలకొండపల్లి:**ప్రజల వద్దకే పాలన అందించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టామని, ఇక్కడ ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి బోదులబండ క్లస్టర్‌లో 12 గ్రామాలు ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా గత 2.4 సంవత్సరాలలో రేవంత్ రెడ్డి నాయకత్వం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇళ్లులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇళ్ల మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణానికి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకపోవడం వల్లే ఇందిరమ్మ ఇళ్లకు ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, తమ ప్రభుత్వం ఇళు ఇవ్వడమే కాకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. మే నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.పార్టీలకు అతీతంగా ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మూడవ, నాలుగవ దశల్లో కూడా ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.భూమి సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంటూ, గత ప్రభుత్వ ధరణి విధానం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే 2 నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. భూ భారతి ద్వారా అనేక సమస్యలు ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామని, ప్రభుత్వ భూములను సాదాబైనామా ద్వారా ఆక్రమించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఈ రోజు ప్రతిష్ఠాత్మకంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, నేలకొండపల్లి మండలంలో ఇది రెండో క్లస్టర్ కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అందిన ప్రతి వినతిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధగ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సాగులో 'పుదీనా' పరిమళం

**-అరెకరంతోనే ఆర్థిక భరోసా**

**టీ మీడియా ,మే 2 , జూలూరుపాడు :** వ్యవసాయం అంటే కేవలం చెమట చిందించడమే కాదు. అది ఒక నిరంతర తపస్సు, పక్కా ప్రణాళికతో కూడిన జీవన కళ అని నిరూపిస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ సీనియర్ రైతు. మూడు దశాబ్దాలకు పైగా ఒకే పంటను నమ్ముకుని, స్వయంకృషితో ఆర్థిక స్థిరత్వాన్ని సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**భూమినే నమ్మి**

జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన ఏరిదేసి యాలాద్రి (63) అనే రైతుకు మొత్తం 3.50 ఎకరాల పొలం ఉన్నప్పటికీ, ఆయన విజయంలో కీలకం మాత్రం ఆ 'అరెకరం' పుదీనా సాగుదే. గత 35 ఏళ్లుగా సాంప్రదాయ పంటల వెనుక పరుగులు తీయకుండా, మార్కెట్‌లో నిత్యం డిమాండ్ ఉండే పుదీనాను సాగు చేస్తూ తన జీవన గమనాన్ని మార్చుకున్నారు.

**నేల తల్లితో అనుబంధం**



యాలాద్రి సాగు పద్ధతి చాలా ప్రత్యేకమైనది. ఒకేచోట కాకుండా, భూసారాన్ని కాపాడుకుంటూ ఏటా అరెకరం చొప్పున స్థలాన్ని మారుస్తూ పుదీనాను సాగు చేస్తారు. పుదీనాకు కేటాయించిన అరెకరం కాకుండా, మిగిలిన మూడు ఎకరాల్లో పత్తితో పాటు సేంద్రీయ పద్ధతుల్లో ఇతర పంటలను సాగు చేస్తూ ప్రకృతితో మమేకమవుతున్నారు. కూలీల మీద ఆధారపడకుండా యాలాద్రి తన భార్యతో కలిసి ప్రతిరోజూ పొలంలో శ్రమిస్తారు. దంపతులిద్దరూ సొంతంగా సాగు పనులు చూసుకోవడం వల్ల పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, పంటపై పూర్తి పట్టు సాధించారు.పుదీనా సాగు ద్వారా వచ్చే నిలకడైన ఆదాయం యాలాద్రి కుటుంబానికి పెద్ద అండగా నిలిచింది. రోజుకు సుమారు రూ.1,000 నుండి రూ.2,000 వరకు ఆదాయం పొందుతూ నెలకు సగటున రూ.40 వేల నుండి 50 వేల వరకు

మిగతా 3లో





## గుండెపోటుతో మరణించిన హోంగార్డ్ సురేష్

**-నివాళులర్పించిన ఎస్పీ రోహిత్ రాజు**

**టీ మీడియా, మే 2, కొత్తగూడెం:** వన్టౌన్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ ఆఫీసర్ సురేష్ కు శనివారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు ప్రధమ చికిత్స అందిస్తుండగానే సురేష్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత హాస్పిటల్ లో ఉన్న హోంగార్డ్ ఆఫీసర్ సురేష్ భౌతిక కాయానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నివాళులర్పించారు.ఎల్లప్పుడూ చురుకుగా విదులు నిర్వర్తించే సురేష్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం పట్ల ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించి,తదుపరి కార్యక్రమాలను దగ్గరుండి చూసుకోవాలని అధికారులకు సూచించారు.



## వైభవంగా ముత్యాలమ్మ పోతురాజు విగ్రహ ప్రతిష్ట

**టీ మీడియా మే 2, కొణిజర్ల :**మండల పరిధిలోని సీగలంపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.నూతనంగా నిర్మించిన ఆలయంలో ముత్యాలమ్మ తల్లి మరియు పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది.మూడు రోజుల పాటు కనులపండువగా వేడుకలు నిర్వహిస్తున్నారు తెలిపారు.బ్రహ్మశ్రీ నేతముట్ల మహేష్ కుమార్ శాస్త్రి, బ్రహ్మశ్రీ పి. పవన్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి అని.మే 3 (ఆదివారం):ముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం, అనంతరం శిఖర ప్రతిష్ఠా వేడుకలు కన్నుల పండువగా నిర్వహించనున్నారు.మే 3వ తేదీ ఆదివారం ఉదయం 11:00 గంటల నుండి భక్తులందరికీ భారీ ఎత్తున మహా అన్నదానం ఏర్పాటు చేయబడింది. ఈ పుణ్యకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల ప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రతిష్ఠా వేడుకలు గ్రామానికి సుభిక్షాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, తాగునీటి వసతులు కల్పించారు. చుట్టుపక్కల మండలాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.



## తాగునీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బంది

**టీ మీడియా, మే 2, ఖమ్మం:**

48వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో పంపుల రిపేర్ పనుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.విషయం తెలుసుకున్న 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు అల్లె సాయికిరణ్ వెంటనే స్పందించారు. పై అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకర్‌ను తెప్పించారు. స్వయంగా కాలనీలో ఉండి ట్యాంకర్ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందేలా పర్యవేక్షించారు. పంపుల మరమ్మత్తులు పూర్తయ్యే వరకు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.సకాలంలో స్పందించి సమస్య తీర్చిన సాయికిరణ్కి కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# ‘అమ్మ’గా సర్పంచ్ సలీమా ఖాసీం..

**వరుసగా రెండో పెళ్లి కానుక అందజేత**

**టీ మీడియా, మే 2, ముదిగొండ :**మాట ఇస్తే తప్పకూడదు.. అది రాజకీయాల్లో అయినా, వ్యక్తిగత జీవితంలో అయినా అని నిరూపిస్తున్నారు న్యూ లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ సలీమా ఖాసీం. ఎన్నికల సమయంలో గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ వివాహానికి తన వంతుగా సాయం అందిస్తానని ప్రకటించిన ఆమె, ఆ మాటను క్షేత్రస్థాయిలో వరుసగా అమలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.తొలి అడుగు మార్చిలో.. మలి అడుగు మేలో: సర్పంచ్ సలీమా ఖాసీం తన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపిస్తున్నారు. గత మార్చి నెలలో గ్రామానికి చెందిన కొట్టే శ్రీవాణి వివాహం సందర్భంగా మొదటిసారి పెళ్లి కానుకను అందజేసి తన సేవా యజ్ఞాన్ని ప్రారంభించారు. తాజాగా, మే నెలలో గ్రామానికి చెందిన పెరుమాళ్ళ దీప్తి వివాహం సందర్భంగా రెండోసారి 50 కేజీల బియ్యం మరియు విలువైన చీరను స్వయంగా అందజేశారు. నిలకడైన సేవ.. నిరుపమాన నిబద్ధత: కేవలం ఒకసారి ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా, గ్రామంలో వివాహం జరిగే ప్రతి ఇంటికీ వెళ్లి అండగా నిలబడాలనే సర్పంచ్ దంపతుల నిర్ణయం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. “మార్చిలో శ్రీవాణికి, ఇప్పుడు దీప్తికి నా వంతు సాయం అందించడం తృప్తినిచ్చింది. రాజకీయాలు ఎన్ని ఉన్నా, మానవత్వంతో పేద కుటుంబాలకు అండగా ఉండటమే నా మొదటి ప్రాధాన్యత” అని అన్నారు.ఒక ఆడబిడ్డ పెళ్లి అంటే ఆ కుటుంబానికి ఎంతో భారం ఉంటుంది. అలాంటి సమయంలో సర్పంచ్ స్వయంగా వచ్చి సాయం అందించడం ఆ



కుటుంబానికి కొండంత అండగా నిలుస్తోంది. ఇచ్చిన మాటను వరుసగా రెండోసారి కూడా నిలబెట్టుకున్న సర్పంచ్ సలీమా ఖాసీంపై న్యూ లక్ష్మీపురం గ్రామస్తులు మరియు వధువు కుటుంబ సభ్యులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇలాంటి సర్పంచ్ మా ఊరికి ఉండటం గర్వకారణమని వారు పేర్కొంటున్నారు.

# శభాష్ లతీఫ్ బాయ్

**-- మాజీ ఎంపీ నామ అభినందనలు**

**టీ మీడియా, మే 2, ఖమ్మం:**గర్భిణీ స్త్రీల టెస్ట్‌ల కోసం అలాగే డెలివరీ సమయాల్లో ఉచితంగా తన ఆటోలో తీసుకెళ్లి హాస్పిటల్‌కు చేర్చుతున్న లతీఫ్‌ను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు “శభాష్ లతీఫ్ బాయ్” అంటూ అభినందించారు. మారుమూల గ్రామాల్లో బస్సు సౌకర్యం లేని ప్రాంతాల్లో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని నామ తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన సమయంలో కూడా ఖర్చును పట్టించుకోకుండా, తన పంక్చర్ షాప్‌ను నడుపుతూ అవసరమైన వేళల్లో సేవలు అందించడం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా నామ స్ఫూర్తితోనే ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు లతీఫ్ నామకు తెలిపారు. నామ ట్రస్ట్ ద్వారా వైరా పట్టణం, రూరల్ మండలానికి చెందిన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందించడం, నామ తండ్రి ముత్తయ్య పేరుతో గ్రామాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, బోర్లు వేయించడం, ఆరోగ్య సేవలు వంటి సేవ కార్యక్రమాలను లతీఫ్ గుర్తు చేసుకున్నారు. అలాగే 17వ లోక్‌సభ కాలంలో నామ గారు తన నిధుల ద్వారా వైరాకు అందించిన అంబులెన్స్ అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతోందని, కోవిడ్ సమయంలో కూడా తాను తన ఆటోతో సేవలు అందించానని వైరా మండలం పరిసర గ్రామాలైన స్టేజి పినపాక,



సిరిపురం, కే.జి. సిరిపురం, పూసలపాడు, గౌండ్లపాలెం, నారపనేనిపల్లి, విప్పలమడక, లింగనపాలెం, గరికపాడు, దాచాపురం, సన్నాల లక్ష్మీపురం, ముసలిమడుగు, పుణ్యాపురం, పాత పినపాక తదితర గ్రామాల నుండి వైరాకు గర్భిణీలను 24 గంటలు ఉచితంగా తన ఆటోలో తీసుకెళ్తున్నాని లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, లతీఫ్ లాంటి సేవాభావం కలిగిన వ్యక్తులు పెరగాలని, భవిష్యత్తులో కూడా లతీఫ్ తన సేవలను మరింత విస్తరించి, మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# అభివృద్ధి చెంతే ‘ప్రజా దర్బార్’

**నేడు కూసుమంచిలో నిర్వహణ**

**టీ మీడియా, మే 2, కూసుమంచి :**ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతూ సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి కొంగులేటి శ్రీనివాసరెడ్డి ‘ప్రజా దర్బార్’కార్యక్రమాన్నిప్రారంభించినట్లు కూసుమంచి మండల కాంగ్రెస్ నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి, వట్టి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ప్రభుత్వంలోని అన్ని శాఖల అధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ప్రజల సమస్యలను నేరుగా అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి క్లస్టర్ కేంద్రంగా ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రజా దర్బార్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి కూసుమంచి మండలంలోని కూసుమంచి, ఈశ్వర్ మాదారం, రాజుపేట బజార్, రాజుపేట, గోరిలపాడు తండా, అజ్మీర తండా, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, గట్టుసింగారం, మల్లేపల్లి, జుజ్జుర్లపేట, మల్లాయగూడెం, లింగారం తండా, గంగబండ తండా గ్రామాలకు చెందిన ప్రజలు హాజరుకావచ్చని తెలిపారు.అదేవిధంగా తిరుమలపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ కేంద్రంగా మధ్యాహ్నం 3.30 గంటలకు మరో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బచ్చోడు, బచ్చోడు తండా, బీరోలవారి గూడెం, పైనంపల్లి, రాజారం, సోలిపురం, మంగలి బండ తండా, జూపెడ, కాకరవాయి, సుద్దవాగు తండా, ఏసుకుంట తండా గ్రామాలకు చెందిన ప్రజలు హాజరు కావచ్చని తెలిపారు.

# నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

**-అడిషనల్ కలెక్టర్ శ్రీజ హెచ్చరిక**

**టీ మీడియా, మే 2, ముదిగొండ:**ముదిగొండ మండలం రాఘవాపురం గ్రామంలోని ‘భవిత’ పాఠశాల మరమ్మత్తు పనుల్లో జాప్యం వహించిన అధికారులపై అడిషనల్ కలెక్టర్ శ్రీజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలను సందర్శించిన ఆమె, పనుల పురోగతిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ పనులు పూర్తి చేయడంలో విఫలమైనందుకు మండల



విద్యాశాఖాధికారి (ఎంఈఓ) రమణయ్యపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనకు 10 రోజుల వేతనం కట్ చేయడంతో పాటు, అవసరమైతే బదిలీకి సిఫార్సు చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు.పాఠశాల మరమ్మత్తుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.3 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనులు నెమ్మదిగా సాగడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.వచ్చే సోమవారం లోపు అన్ని పనులు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని గడువు విధించారు. పనులు పూర్తయ్యిన వెంటనే ‘వన్ టైమ్ పేమెంట్’ విధానంలో బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఎంఓ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ పార్వతి, వార్డు సభ్యులు మెట్టెల సతీష్, రమాదేవి, యువ నాయకుడు బుర్రా సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి వితరణ

**టీ మీడియా,మే02, సింగరేణి (కారేపల్లి):**కారేపల్లి మండలం మూడుతండాకు చెందిన మూడు జామీ ఇటీవల మృతి చెందింది. పేద కుటుంబం కావటంతో జామీ సంస్మరణ కార్యక్రమానికి రేలకాయలపల్లి మాజీ సర్పంచ్ భూక్య రమణ, మాజీ ఎంపీటీసీ ధర్మసోత్ శంకర్, మాజీ వార్డు సభ్యులు మూడు వీరస్వామి కలిసి కొంత నగదుతో తోపాటు 75 కేజీల బియ్యంను శనివారం వితరణ చేశారు. ఈకార్యక్రమంలో గణితి సత్యనారాయణ, గణితి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వృద్ధురాలు మృతి



**టీ మీడియా ,మే2, కొణిజర్ల :**మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన తేజావత్ చప్లి (75) అనే వృద్ధురాలు వడదెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురైన చప్లి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.75 ఏళ్ల వయసులో ఇలాంటి విషాద మరణం సంభవించడం ఆమె కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రస్తుత ఎండల దృష్ట్యా వృద్ధులు, చిన్న పిల్లలు ఎండలో బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులు సూచిస్తున్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**టీ మీడియా,మే2, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దారావత్ వికాస్ వివాహ వేడుక శనివారం జరిగింది. ఈ వేడుకకు నాయకులు,ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బెల్ కంపెనీ మేనేజర్ గుగులోత్ రవి, భూక్య రవీందర్ (సిఐ) హైదరాబాద్, బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు ఎస్కే గౌసుద్దీన్, తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు డొంకెన రవీందర్, లాకావత్ రాము, జడల కళ్యాణ్ పాల్గొన్నారు.అలాగే కారేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, కోశాధికారి సాక్షి శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**టీ మీడియా,మే2, సింగరేణి (కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామానికి చెందిన వట్టం సుధాకర్ ఇటీవలి కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అనుచరుడు, బీఆర్ఎస్ మాజీ కార్యదర్శి అజ్మీర వీరన్న పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరమని, జర్నలిస్టుగా ప్రజల కష్టాలను దగ్గరగా చూసిన వ్యక్తిగా బాధిత కుటుంబాలకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు వీరన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఈసం విష్ణు, సూర్యం, రాంమూర్తి, రామారావు, నాగేంద్రబాబు, వాంకుడోత్ విజయ్, భూక్యా రాంకీ తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు


**హౌసింగ్ పీడీ శ్రీనివాస్**

**ఆరోపణలు నిరాధారం గా తేలాయి-**

**టీ మీడియా, మే 2, కూసుమంచి:** బీపీఎల్ కుటుంబానికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు చేసినట్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని హౌసింగ్ పీడీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పాలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏప్రిల్ 29న నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారు నీలమ్మ మాట్లాడిన అంశంపై వివిధ మాధ్యమాలలో వస్తున్న ప్రచారాలపై లబ్ధిదారుని అర్హతపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సమగ్ర విచారణ నిర్వహించారని, ఈ మేరకు కూసుమంచి మండల అభివృద్ధి అధికారి టి. జశ్వంత్ కుమార్ పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈలతో కలిసి సంబంధిత లబ్ధిదారు పిల్లి నీలమ్మ ఇంటిని ప్రత్యక్షంగా సందర్శించి అర్హతలను పరిశీలించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.విచారణలో లబ్ధిదారు కుటుంబం బీపీఎల్ వర్గానికి చెందినదిగా నిర్ధారించబడింది అని, వారి కుటుంబానికి ప్రస్తుతం ఎటువంటి భూమి యాజమాన్యం లేదని తేలిందన్నారు. ఫీల్డ్ విజిట్ సమయంలో గమనించిన నివాస గృహం గతంలో పాడు బడిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు.ఇందిరమ్మ కమిటీతో పాటు సంబంధిత అధికారుల సిఫార్సుల మేరకు గృహం మంజూరు చేపట్టినట్లు, కుటుంబ నేపథ్యం పరిశీలించగా, పిల్లి మల్లయ్య వృత్తిరీత్యా మత్స్యకారుడు కాగా, నీలమ్మ దినసరి కూలి కార్మికురాలిగా జీవనం సాగిస్తున్నారని తెలిసింది.గతంలో జీవనోపాధి అవసరాల కోసం కొంత భూమిని విక్రయించినట్లు, అలాగే ఒక సంతానాన్ని విదేశాలకు పంపేందుకు కొంత మొత్తం రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైందనీ, కుటుంబంలోని కుమార్తె ఇంజనీరింగ్ పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగంలో లేరని తెలిపారు.పై అంశాలన్నింటిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం, గృహ మంజూరు పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరిగిందని, అర్హత లేని వారికి ఇళ్ల మంజూరు చేశారనే ఆరోపణలు అసత్యమని హౌసింగ్ పీడీ స్పష్టం చేశారు.ఇంకా, కుటుంబంలోని కుమారుడు ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లిన సందర్భంలో, మొత్తం 16,560 పౌండ్ల ట్యూషన్ ఫీజులో 16,000 పౌండ్లు యూనివర్సిటీ ఆఫ్ సాల్ఫోర్డ్ మాంచెస్టర్ నుండి గ్లోబల్ గోల్డ్ ఎక్సెన్స్ స్కాలర్‌షిప్ రూపంలో లభించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇది విద్యార్థి ప్రతిభను ప్రతిబింబించే అంశమని హౌసింగ్ పీడీ పేర్కొన్నారు.విచారణ సందర్భంగా పిల్లి నీలమ్మ మాట్లాడుతూలి తాను మొదటిసారి వేదికపై మాట్లాడడంతో పొరపాటు పడ్డానని తెలిపారు. తమ కుమారుడు లిఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన తర్వాతే లండన్‌కు వెళ్లారని, కుమారుడిని విదేశాలకు పంపేందుకు రుణం, తమ అత్త మామలకు సంబంధించిన సుమారు 1.25 గుంటల భూమిని అమ్మి బంధువులు డబ్బులు సమకూర్చారని వివరించారు.తమ కుమార్తె ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రైవేట్ రంగంలో పని చేస్తోందని, ప్రభుత్వ ఉద్యోగంలో లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎన్నో కష్టాలు అనుభవించిందని, కొన్నిసార్లు ఆహారం కూడా లేక ఇబ్బందులు పడ్డామని, భర్త మత్స్యకారుడిగా పనిచేస్తుండగా తాను కూలి పనులు చేసి పిల్లలను చదివించా మని, ఎవరినీ మోసం చేయలేదని, దయచేసి తమపై తప్పుడు ప్రచారం చేయవద్దని ఆమె కోరారు.ఈ విషయంపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని హౌసింగ్ పీడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత

**-ఎస్పీ రోహిత్ రాజు**



**టీ మీడియా, మే 2, భద్రాద్రి కొత్తగూడెం:**ఆదివారం జరిగబోయే నీట్–2026 ప్రవేశ సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 163 దీచూరా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా పరిధిలోని మొత్తం 03 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని,పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.సింగరేణి ఉమెన్స్ కళాశాల (కొత్తగూడెం),రామచంద్ర డిగ్రీ కళాశాల (లక్ష్మీదేవిపల్లి),సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల లలోని పరీక్ష కేంద్రాల్లో జరగబోయే ఈ పరీక్షకు జిల్లా నుండి 1048 అభ్యర్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## నష్టపోయిన మక్క రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**టీ మీడియా ,మే 2, ఇల్లెందు :** చేతికి వచ్చిన మొక్కజొన్న అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కావడం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీలో జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంటలు దగ్ధమై నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు చల్ల సముద్రం, గ్రామ సర్పంచ్ ఏపే శంకర్, ఉప సర్పంచ్ గుగ్గిళ్ల నరేష్, సహకార వ్యవసాయ సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్లు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చే సమయంలో అగ్నిప్రమాదంలో కాలిపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే సహాయం అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పూనెం లింగమ్మ, యువ నాయకులు భూక్య సురేష్, అయిలు నారాయణ గౌడ్, సోలం జనార్దన్, బానోత్ బనిషా, గుగ్గిళ్ల పవన్ పాల్గొన్నారు.



## సాగులో 'పుదీనా' పరిమళం

ఆర్జిస్తున్నారు. ఈ సంపాదనతోనే తన కుమార్తె రాజేశ్వరిని ఉన్నత చదువులు చదివించి ఒక తండ్రిగా తన బాధ్యతను అత్యంత గౌరవప్రదంగా నెరవేర్చారు. పుదీనా అనేది ప్రతిరోజూ వంటల్లో, హోటళ్లలో అవసరమయ్యే నిత్యావసర వస్తువు. అందుకే మార్కెటింగ్ సమస్యే రాదు అని యాలాద్రి ధీమాగా చెబుతారు. తెల్లవారుజామునే తాజాగా కోసి మార్కెట్‌కు చేరవేయడం వల్ల వ్యాపారులే తన వద్దకు వస్తుంటారన్నారు. నమ్మిన నేల ఎప్పుడూ మోసం చేయదు.. కష్టపడే గుణం ఉంటే అరెకరం పొలం కూడా అన్నపూర్ణమ్మలా ఆదుకుంటుందని ఆదర్శ రైతు ఏరిదేసి యాలాద్రి అన్నారు. ఒకే రకమైన సాగు చేస్తూ పెట్టుబడులు పెట్టి ప్రకృతి వైపరీత్యాలతో అప్పుల పాలవుతున్న రైతులు యాలాద్రి చేపడుతున్న సూత్రాన్ని పాటిస్తూ తక్కువ పెట్టుబడి, నిత్య ఆదాయం వచ్చేలా వినూత్నంగా పంటల సాగు చేపట్టాలని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు.

## విద్యుత్ స్తంభాలు

## ఏర్పాటు చేయండి : సీఐటీయూ

**టీ మీడియా ,మే 2, ఖమ్మం రూరల్**

మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో గల శ్రీ సాయి బృందావన్ నగర్ ఎంట్రన్స్, భారత్ గ్యాస్ వద్ద విద్యుత్ లైట్లు లేక వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర నాయకులు బి.మధు, జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమళ్లపల్లి మోహన్ రావు అన్నారు. రాత్రి సమయంలో రోడ్లపై విష పురుగులు తిరుగుతున్నాయని కాలనీవాసులు ప్రతిరోజు భయాందోళనకు గురవుతున్నారని పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ త్వరలోనే విద్యుత్ స్తంభాలు,వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.

## ప్రతి సోమవారం

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్

**టీ మీడియా ,మే 2, కల్లూరు**

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ప్రజావాణి ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని ప్రజలు వారి సమస్యలను విన్నవించుకోవచ్చునని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించబడునని చెప్పారు.